సాక్షి
విశాఖపట్నం
శనివారం । 17 । ఆగస్టు । 2024



ఫా'రెస్ట్' ఆఫీసర్లు
నరవ ప్రాంతంలోని అటవీ శాఖ భూముల్లో మట్టితవ్వుకుపోతున్న ఫారెస్ట్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. 8లో



సంబల్‌పూర్-ఈరోడ్ స్పెషల్ రైలు పొడిగింపు 8లో



ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ సందర్శన
ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌ని రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ హరిప్రసాద్ సందర్శించారు. 8లో

చేర్చుకున్నారు.. ఛీ కొట్టారు



మీ దారి మీ ఇష్టం...!
- పార్టీ మారిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు కూటమి ఝలక్
- ప్రలోభాలతో పార్టీ మారిన కొందరు స్థానిక నేతలు
- ఎమ్మెల్సీ ఏకగ్రీవంతో ఇప్పుడు పట్టించుకోని వైనం
- స్థానిక నేతలు అంగీకరించడం లేదంటూ మెలిక
- డబ్బు ఇస్తామని ఆశ చూపి... ఇప్పుడు పట్టించుకోని దుస్థితి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఏరు దాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా తయారైంది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్లేటు ఫిరాయించిన నేతల పరిస్థితి. మొదట్లో డబ్బు, పదవి, పనుల ప్రలోభాలతో పార్టీలో చేర్చుకుని... తీరా పార్టీ మారిన తర్వాత కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు అచ్చం ఇలాగే ఉందని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉందామని భావించి భారీగా ప్రలోభాలకు దిగిన కూటమి నేతలు.. ఇప్పుడు ఏకగ్రీవంతో చేతులెత్తేశారు. పార్టీ మారిన నేతలకు... స్థానికంగా తమ నాయకులు అంగీకరించడం లేదని కూటమి పెద్దలు కొర్రీలు పెడుతున్నారు. ఇస్తామన్న డబ్బు ఇవ్వకపోవడంతోపాటు పార్టీ పదవులు కూడా ఇవ్వలేమని తేల్చిచెబుతున్నారు. ఇక మీ దారి మీ ఇష్టమంటూ కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ మారి భారీగా దండుకుందామని ఉవ్విళ్లూరిన స్థానిక నేతలకు గట్టి దెబ్బే తగిలింది. తమకు సీటిచ్చి... గెలిపించిన పార్టీని కాదని ఆశతో పార్టీ మారిన నేతలకు కొత్త ఇబ్బందులు వచ్చిపడ్డాయి. ఇస్తామన్న డబ్బు ఇవ్వలేదని.. అధికార పార్టీలో చేరి కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుందామనుకుంటే కనీసం ఇప్పుడు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఫలితంగా కూటమి నేతల అసలు స్వభావం తమకు బాగా తెలిసి వచ్చిందని మండిపడుతున్నారు.

భారీగా ఆశలు చూపి...!

బరిలో నిలిచేందుకు అనుగుణంగా 200 మందికిపైగా నేతలను తమ వైపు తిప్పుకోవాలని కూటమి నేతలు ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. తోచిన హామీ ఇచ్చి అడిగినంత నగదు ముట్టచెబుదామంటూ వరాల వర్షం కురిపించారు. పార్టీలో చేరిన తర్వాత కాంట్రాక్టులు ఇప్పిస్తామని కూడా పేర్కొన్నారు. ఈ మాయ మాటలను నమ్మిన కొద్దిమంది ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నుంచి కూటమి పార్టీల్లో చేరారు. ఎన్నికలు ముగిసి కూటమి అభ్యర్థి గెలిచిన వెంటనే హామీ ఇచ్చిన మేరకు నగదు ముట్టచెబుదామని పేర్కొన్నారు. అయితే, చేరికలు అనుకున్న మేరకు లేకపోవడం, ఓటమి ఖాయమని తెలిసి బరిలో నిలిచేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. దీంతో అప్పటివరకు ఆశలు చూపిన కూటమి నేతలు ఒక్క హామీని నెరవేర్చకుండా జారుకున్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న తమ పార్టీ నేతలు... మీ చేరికలను అంగీకరించడం లేదని మెలిక పెట్టడం ప్రారంభించారు. అందువల్ల పార్టీలో కూడా చేర్చుకోలేమని స్పష్టం చేశారు. ఫలితంగా కొద్దిమంది నేతలు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరుతుండగా.. మరికొందరు నేతలు ముఖం చెల్లక తిరిగి వచ్చేందుకు జంకుతున్నారు. మొత్తంగా తమ పరిస్థితి ఓడ మల్లన్న... బోడి మల్లన్నగా మారిందంటూ వాపోతున్నారు.

బరిలో నిలుద్దామని...

విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 830 ఓట్లు కాగా.. అందులో 615 ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. మిగిలిన 215 ఓట్లు మాత్రమే కూటమికి చెందినవి.. అయినప్పటికీ ఎన్నికల్లో నిలిచి ప్రలోభాలతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కొనుగోలు చేద్దామని భావించారు. ఇందుకు అనుగుణంగా ఎక్కడికక్కడ సమావేశాలను కూడా నిర్వహించారు. అయితే వైఎస్సార్‌సీపీ ఒక అడుగు ముందుకు వేసి.. బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు కూటమి నుంచి ఎవరిని బరిలో నిలుపుదామనే విషయంలోనే ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. మొదట్లో గండి బాబ్జీ, పీలా గోవింద్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. తీరా బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత వీరిద్దరూ పోటీలో ఉండలేమని తేల్చిచెప్పారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలతో నేరుగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు మెజార్టీ నేతలు హాజరయ్యారు. కూటమి నేతలు భారీగా ప్రలోభాలు చూపుతూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను తమవైపు లాగేందుకు ప్రయత్నించారు. కొద్దిమంది ప్రలోభాలకు లొంగి అటువైపు చేరారు. అయినప్పటికీ ఆశించినస్థాయిలో చేరికలు లేకపోవడం వంటి పరిస్థితులల్లో బరిలో నిలిచేందుకు కూటమి నేతలు ఒక్కొక్కరు వెనుకడుగు వేశారు. చివరికి దిలీప్ చక్రవర్తి పేరును మంత్రి లోకేష్ తెరమీదకు తెచ్చారు. అయితే పోటీ చేయవద్దని కోరుతూ దిలీప్ చక్రవర్తి వ్యాపార భాగస్వామి, ఎమ్మెల్సీతో మాజీ మంత్రి ఒకరు గట్టిగా చెప్పించారు. అనవసరంగా బరిలో నిలిచి జేబు ఖాళీ చేసుకోవద్దంటూ సలహా ఇచ్చారు. ఫలితంగా ఆయన కూడా పోటీకి వెనుకడుగు వేశారు. పైకి మాత్రం విలువలు, విశ్వసనీయత అని చెప్పి పోటీలో నిలవడం లేదని చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రకటనలతో అప్పటి వరకు భారీగా ప్రలోభాలు ప్రకటించిన కూటమి నేతలు పార్టీలో చేరిన నేతలను పట్టించుకోవడం మానేశారు.

అనితర సాధ్యుడు బొత్స

ప్రజాబలమున్న నాయకుడు.. ఉత్తరాంధ్రకు ఆప్తుడు.. రాజకీయాల్లో ఢక్కాముక్కీలు తిని రాటుదేలిన విజయనగరం పెద్దాయన.. ఆయనెవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందరూ అభిమానించే బొత్స సత్యనారాయణ. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ వ్యూహాలు, బొత్స సత్యనారాయణ స్థాయి ముందు కూటమి ఎత్తుగడలు ఫలించలేదు. శతవిధాలా కూటమి నేతలు ప్రయత్నించినప్పటికీ బొత్స బలం ముందు ఎవరూ పోటీ చేయడానికి సాహసం చేయలేకపోయారు. దీంతో బొత్స.. ఎదురన్నదే లేకుండా ఎమ్మెల్సీగా గెలుపొందారు.

- అందరికీ ఆమోదం.. అందుకే ఏకగ్రీవం
- బొత్స రాజకీయ చతురత ముందు నిలవలేని కూటమి కుయుక్తులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, విశాఖపట్నం: విద్యార్థి దశ నుంచే తోటి విద్యార్థులకు సహాయం చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వంటి నాయకత్వ లక్షణాలు అలవరుచుకున్న బొత్స అంచెలంచెలుగా.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా అనేక పదవులు చేపట్టారు. తన రాజకీయ చరిత్రలో అందరివాడుగా నిలిచారనే చెప్పుకోవచ్చు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స వ్యూహం ముందు కూటమి పార్టీలే డీలా పడ్డాయి. వైఎస్సార్‌సీపీకి స్థానిక సంస్థల ఓటర్ల బలముంది. దీంతో పాటు ఎన్నికల నిర్వహణ నైపుణ్యం కలిగిన బొత్సను బరిలోకి దించడంతో ఆయనకు దీటైన పోటీ కోసం కూటమి ప్రభుత్వం గట్టి కసరత్తు చేసింది. కానీ బొత్స వ్యూహం ముందు కూటమి ప్రణాళికలు చిన్నబోయాయి. బలం లేకున్నా ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయాలని కూటమి నేతలు కుయుక్తుల పన్నినా.. వారి పన్నాగాలు ఫలించలేదు. ఆ స్థానానికి మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ ఉల్లా నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ జోరు చూసి కూటమి వెనక్కి తగ్గింది. బొత్సపై అభిమానంతో వేసిన ఒక్క నామినేషన్‌ను కూడా ఈ నెల 14వ తేదీన ఉపసంహరించుకున్నారు. దీంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవమైంది.

వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ

బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ. అప్పుడు మహానేత వైఎస్సార్‌తో సన్నిహితంగా మెలిగిన బొత్స.. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కూడా అంతే సన్నిహితంగా ఉంటున్నారు. మహానేత వైఎస్సార్ కేబినెట్‌లో ఉత్తరాంధ్ర ప్రాంత వెనకబడిన వర్గాలకు చెందిన బొత్సకు అప్పట్లో కీలక మంత్రి పదవి కేటాయించారు. మళ్లీ అదే తరహాలో 2019–24లో ఐదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో కూడా కీలక మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్



మధుస్మితకు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కమ్‌టాక్స్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత (ఐఆర్‌ఎస్) దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆమెకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు అష్టోత్తరంపూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

కేజీహెచ్‌లో ప్రత్యామ్నాయ చర్యలు

మహారాణిపేట: కోల్‌కతాలో మెడికో హత్యకు నిరసనగా జూనియర్ వైద్యులు,వైద్య విద్యార్థులు ఆందోళన ఉధృతం చేశారు. శుక్రవారం నుంచి సమ్మె చేస్తుండడంతో కేజీహెచ్ బోసిపోయింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి కేజీహెచ్ ఆందోళనకారులు ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ వైద్యులు, ఇతర వైద్య విద్యార్థులు సమ్మె చేస్తుండడంతో కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేశారు. 25 మంది వైద్యులను ఓపీల్లోను, వార్డుల్లో నియమించారు. పలువార్డుల్లో డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. వైద్యులకు సెలవు రద్దు చేసినట్టు సూపరింటిండెంట్ తెలిపారు.

'గైస్' ప్రిన్సిపాల్‌కు అంతర్జాతీయ అవార్డు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అంతర్జాతీయ బిల్డర్స్ అవార్డు లభించింది. ఆయన పాలిటెక్నిక్ విద్యకు విశేషమైన సేవలు అందించినందుకు ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్గనైజ్డ్‌రీసెర్చ్ ఇండియాకు అనుబంధంగా ఉన్న ఐ2ఓఆర్ ఎంఎస్ఎంఈ సంస్థ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు అవార్డుతోపాటు ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అందించారు. ఈ సందర్భంగా వెంకట రమణను పలువురు అభినందించారు.

మంగళకారిణి.. తేజోరూపిణి

- స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు, వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన ఆలయాలు



చల్లంగా చూడమ్మా..అంటూ కనకమహాలక్ష్మి అమ్మవారిని తాకుతున్న భక్తులు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



పట్టు వస్త్రాలంకరణ..,గాజుల అలంకరణలో కన్యకాపరమేశ్వరి



లక్కీ డ్రాలో ఓ భక్తురాలికి శ్రీలక్ష్మీ వెండి ప్రతిమను అందజేస్తున్న ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు

డాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణతో నగరం మార్మోగింది. పవిత్రమైన రోజున వేలాది మంది భక్తులు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి, తల్లి ఆశీర్వాదం పొందారు. ఇళ్లల్లో అమ్మవారిని అందంగా అలంకరించి, బంగారు కాసులతో పూజించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక కార్యక్రమాలతో నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించి.. వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. 345 మంది ఈ పూజలో నేరుగా పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన పలువురి పేరిట అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు క్షీరాభిషేక సేవ నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలతో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు శ్రీలక్ష్మీ దేవి వెండి ప్రతిమల బహూకరణ

ఉదయం 8 గంటలకు మొదటి బ్యాచ్, 9.30 గంటలకు రెండవ బ్యాచ్ పూజలో పాల్గొన్న మహిళల్లో డ్రా తీసి ఇద్దరికి శ్రీలక్ష్మీ దేవి వెండి ప్రతిమలు బహూకరించారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు చేతులమీదుగా వీటిని అందించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలంకరణలో అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌కు వేకువజాము 5 గంటలకు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనే, గంధం, పసుపు, కుంకుమ తదితర 108 ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో నివేదించి అమ్మవారిని పట్టు వస్త్రాలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. దేవస్థాన ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మ 300 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, శ్రావణమాస ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ కొల్లూరు వెంకట సుజాత పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో భద్రతా చర్యలు పరిశీలన



బ్యాటరీ కారులో పర్యటిస్తున్న నగర సీపీ బాగ్చీ

మహారాణిపేట: నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం సాయంత్రం కేజీహెచ్,ఆంధ్రా మెడికల్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీపీ బాగ్చితోపాటు డీసీపీ–2 తుహిన్ సిన్హా కేజీహెచ్‌లో పలు విభాగాలను బ్యాటరీ కారులో వెళ్తూ సందర్శించారు. కేజీహెచ్‌లో జూనియర్ వైద్యులు శుక్రవారం సమ్మెలోకి దిగిన విషయం తెలిసిందే. సీపీ విద్యార్థుల హాస్టల్ భవనాలు పరిశీలించారు. సమ్మెలో ఉన్నవిద్యార్థులతో మాట్లాడారు. భద్రత చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పిల్లల వార్డులో కూడా పర్యటించారు. కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ శివానంద్ పాల్గొన్నారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా మురళీకృష్ణ



విశాఖ సిటీ: విశాఖ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా కేవీ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన అనంతపురం ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అనకాపల్లి ఎస్పీగా పనిచేసిన ఆయన నెల రోజుల కిందటే బదిలీపై అనంతపురం వెళ్లారు. తాజా బదిలీల్లో విశాఖ ఏపీఎస్పీ కమాండెంట్‌గా నియమితులయ్యారు. అలాగే గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా గరుడ్ సుమిత్ సునీల్‌ను నియమించారు. ఆయన గతంలో విశాఖ సిటీ డీసీపీ–1గా విధులు నిర్వర్తించారు.

డీసీఐలో ఏం జరుగుతోంది.?

- లాభనష్టాలు, బదిలీలతో కూడిన సమగ్ర నివేదిక అందించండి
- అధికారులకు విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం : ఇన్నాళ్లు లాభాల బాట పట్టిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ తొలి త్రైమాసికంలో ఎందుకు నష్టాల్లోకి వెళ్లిందో సమగ్ర వివరాలు అందజేయాలని విశాఖపట్నం పోర్టు చైర్మన్ డా.అంగముత్తు డీసీఐ అధికారుల్ని ఆదేశించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవకతవకలు, షాడో ఎండీ వ్యవహారశైలి, బదిలీలలో పక్షపాతం మొదలైన అంశాలతో 'సాక్షి'లో ఈ నెల 13న 'తవ్వేకొద్దీ నష్టాలే.!' శీర్షికతో ప్రచురితమైన కథనంపై చైర్మన్ స్పందించారు. డీసీఐలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబేతో చైర్మన్ మాట్లాడినట్లు సమాచారం. అసలు షాడో ఎండీగా వ్యవహరిస్తోందెవరు? బదిలీల్లో ఎందుకు పారదర్శకత పాటించలేదు.. అనే వివరాలు వెంటనే అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. నష్టాల నుంచి కోలుకుంటూ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పయనిస్తున్న డీసీఐ మళ్లీ కుదేలవ్వడానికి కారణమెవరన్న వివరాలపైనా ఆరా తీశారు. ఉద్యోగులంతా కలిసికట్టుగా పనిచేస్తేనే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నిలబడుతుందన్న విషయాన్ని మర్చిపోయారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఐదేళ్లకోసారి డ్రైడాక్‌కు వెళ్లాల్సిన డ్రెడ్జర్లు తరచూ ఎందుకు పంపిస్తున్నారంటూ ప్రశ్నించారు. ప్రతి అంశంపై సమగ్ర వివరాలతో నివేదిక అందించాలంటూ వీపీఏ చైర్మన్ డా.అంగముత్తు డీసీఐ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

విశాఖ క్రైమ్ డీసీపీగా లతా మాధురి

విశాఖ సిటీ: విశాఖ క్రైమ్ డీసీపీగా కె.లతా మాధురి నియమితులయ్యారు. ఇక్కడ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న పి.వెంకటరత్నంను బదిలీ చేశారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. ఈ మేరకు నాన్‌క్యాడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. లతా మాధురి ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. అలాగే ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న కె.ఆనందరెడ్డికి బదిలీ చేసినప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదు. సీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న డీసీపీ బి.లక్ష్మీనారాయణను హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. విశాఖలో మెరైన్ ఎస్పీగా ఉన్న ఎం.రజనీని ఏసీబీ ఎస్పీగా బదిలీ చేశారు.

ఏడీసీపీలకు బదిలీలు : నంద్యాలలో ఏడీసీపీ (అడ్మిన్)గా ఉన్న కె.ప్రవీణ్‌కుమార్ విశాఖ ఏడీసీపీ (ట్రాఫిక్)గా నియమితులయ్యారు. ఇక్కడ ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న జి.శ్రీనివాసరావును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా ఉన్న జి.ప్రేమ్‌కాజల్‌ను విశాఖలో సీఐడీ అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. అన్నమయ్య జిల్లాలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న డాక్టర్ వి.బి.రాజ్ కమల్ విశాఖ ఏడీసీపీ(అడ్మిన్)గా రానున్నారు. విశాఖ క్రైమ్ ఏడీసీపీగా ఉన్న పి.మహేష్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీసీపీగా బదిలీ అయ్యారు. విజయవాడలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీగా ఉన్న కె.వి.ఆర్.కె.ప్రసాద్‌ను విశాఖ ట్రాన్స్‌కోలో నియమించారు. ఇక్కడ ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్‌ను ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ ఏడీసీగా పంపించారు.

బతకనివ్వండి..స్వేచ్ఛగా..







బడిలో, గుడిలో..నగరిలో, నడివీధిలో, నట్టడివిలో..పుణ్యభూమి భారతావనిలో..ఎటుచూసినా ఆర్తనాదాలే..విషమించిన, విషనాగుల పశువాంఛకు అకారణంగా.. అమానుషంగా.. నేలరాలుతోన్న స్త్రీమూర్తుల ప్రాణాలే..క్రూరమృగాలూ సిగ్గుపడుతున్నాయి..మృగాళ్ల స్వేచ్ఛను చూసి..సగం చచ్చుబడ్డ శిక్షాస్మృతిని చూసి..కామాంధుల చేతిలో ఎంతోమంది అతివలు అనునిత్యం బలి అవుతున్నా పాలకులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం శోచనీయం. మాతృ స్వరూపమైన స్త్రీని స్వేచ్ఛగా బతకనివ్వండి. మహిళల రక్షణకై కఠినమైన చర్యలను ఆచరణలో చూపండి.. అంటూ మెడికోలు స్కిట్ ప్రదర్శించారు. కోల్‌కతాలో మెడికో హత్యనేపథ్యంలో విశాఖలో వైద్య విద్యార్థులు బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి అనంతరం స్కిట్ ప్రదర్శించారు. – బీచ్‌రోడ్డు

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విశాఖ విద్యార్థులు



జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మురళీనగర్: జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు విశాఖ విద్యార్థులు ఎంపికయ్యారు. నగరానికి చెందిన ఎ.లాల్‌చంద్, బి.సంయుక్త, డి.లాల్‌చంద్, ఎన్.మోహిత్ అర్జున్‌లు ఎంపికయ్యారు. వీరు బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఏవీఎన్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా సంస్థ కరస్పాండెంట్ అదిప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గోపీ కృష్ణ అభినందించారు.

నేడు వైద్య సేవలు బంద్

- జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం ఘటనకు నిరసనగా నిర్ణయం
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర

మహారాణిపేట: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి.. హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం దేశవ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేయాలని ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నిర్ణయించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. జగదాంబ జంక్షన్‌లోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే .. ఏ విధంగా పని చేస్తామని ప్రశ్నించారు. 36 గంటలపాటు విధి నిర్వహణలో ఉండి.. సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటుంటే ఆమెపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయాలన్నారు. జూనియర్ వైద్యులు చేస్తున్న పోరాటానికి ఐఎంఏ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. వైద్యులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎమర్జెన్సీ కేసులు తప్పించి, అన్ని ఓపీ సేవలను బంద్ చేస్తున్నామని.. తమ ఆందోళనకు ప్రజా సంఘాలు మద్దతివ్వాలని కోరారు. ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి నాయుడు, ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) అధ్యక్షుడు వి.సురేష్, ఐఎంఏ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపడతామని జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. ఐఎంఏ ప్రతినిధులు అవినాష్, వై.ఎల్.ఎస్.రావు, కిరణ్మయి, ప్రశాంత్, ప్రణీత, ధరణి పాల్గొన్నారు.

- శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శనివారం వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రి డీజీఎం కె. బంగారురాజు తెలిపారు. రోగులు గమనించాలని కోరారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ సందర్శన

ఆరిలోవ: పాత డెయిరీఫారం సమీపంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)ని రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) పి.హరిప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఇక్కడ సాయుధ బలగాల పునరావాసం కోసం నిర్వహిస్తున్న ప్రీ రిలీజ్ కోర్సులో శిక్షణ పొందుతున్న వారిని పలకరించారు. వారికి అందుతున్న శిక్షణపై ఆరా తీశారు. అనంతరం డిఫెన్స్ విద్యార్థులతో సమావేశమయ్యారు. వారి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు పదవీ విరమణ అనంతరం పౌర జీవనంలో గడపడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డిఫెన్స్ విద్యార్థుల ప్రయోజనం కోసం క్యాంపస్ హాస్టల్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అనుబంధ ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఎఫ్‌సీఐ అసోసియేట్ లెక్చరర్ ఎన్.పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 'కెనరా' ఉపకార వేతనాలు


ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో కెనరా బ్యాంక్ విశాఖ ఏజీఎం మధుసూధన్‌రెడ్డి

విశాఖ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ రూ.24 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందించింది. కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో 'కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేడ్కర్ విద్యా జ్యోతి స్కాలర్‌షిప్ స్కీమ్' కింద శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విశాఖ ఏజీఎం ఎస్.మధుసూధన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. 11 ఏళ్లుగా ప్రతిభ గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ముందుంటుందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర దేశాల్లో చదువుకునే వారికి విద్యా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

16 గంటలు ఆలస్యంగా మెయిల్

తాటిచెట్లపాలెం: హౌరాలో శుక్రవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ సుమారు 16 గంటలు ఆలస్యంగా శనివారం సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరుతుంది. లింక్ రైలు ఆలస్యంగా చేరుకుంటున్నందున.. ఈ రైలు ఆలస్యంగా బయలుదేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఫారెస్ట్ ఆఫీసర్లు

- అడవి దొంగల జోలికిపోని వైనం
- అక్రమ తవ్వకాలపై మౌనం
- 'కూటమి'తో కుమ్మక్కు
- నరవలో ఆగని గ్రావెల్ తవ్వకాలు
- ఫిర్యాదు చేస్తేనే పట్టించుకుంటారట
- కోట్లకు పడగలెత్తిన అక్రమార్కులు


పెందుర్తి మండలం నరవలోని అటవీ, ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ప్రస్తుత పరిస్థితి ఇదీ..

పెందుర్తి: అడవిలో విరిగిన పుల్ల బయటకు తీసుకు రావాలంటే సవాలక్ష అనుమతులు.. అందులో అడుగుపెట్టాలంటే ఎన్నో షరతులు. కానీ పెందుర్తి మండల పరిధిలోని నరవ ప్రాంతంలోని అటవీ శాఖ భూములు అందుకు మినహాయింపు. ఇందులో పుల్లలే కాదు ఏకంగా భూములనే తవ్వుకుని మట్టి ఎత్తుకు పోయినా ఆ శాఖ అధికారులకు చీమ కుట్టినట్లయినా అనిపించదు. వందల ఎకరాల్లోని ప్రకృతి వనరులను కొల్లగొట్టినా వారి కంటికి కనపడదు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ ప్రాంతంలో మట్టిని తరలించుకుపోతున్నా మన్ను తిన్న పాముల్లా మిన్నకుండిపోతున్నారు. ఈ అడవిలో గ్రావెల్ దొంగలు అధికార కూటమి నాయకులంటే భయమో..మరేదైనా 'కారణమో' తెలీదు గానీ..అటవీశాఖ అధికారుల తీరుతో అక్రమంగా అడవిని దోచుకుని కూటమి నాయకులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో ప్రభుత్వ అనుబంధ ఏపీఐఐసీ యంత్రాంగం తీరుకు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. సంస్థకు చెందిన భూముల్లో సైతం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

పరిరక్షణ గాలికి..

పెందుర్తి మండలం నరవ పెద్ద కొండ ప్రాంతంలోని సర్వే నంబర్ 1లో సుమారుగా 970 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములు ఉన్నాయి. దీని విస్తీర్ణం ఇటు పెందుర్తి, అటు సబ్బవరం, మరోవైపు గాజువాక మండలాల పరిధిలో ఉంది. నరవలోని అనేక సర్వే నంబర్లకు సర్వే–1 లోని అటవీశాఖ భూములు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలోని కలప, ఇతర సంపద బయటకు తరలించేందుకు వీలు లేదు. అలాంటిది ఈ ప్రాంతంలో రెండున్నర దశాబ్దాలుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడపాదడపా జరుగుతున్నాయి. ముందుగా ప్రభుత్వ భూముల్లోకి చొరబడుతున్న గ్రావెల్ దొంగలు తరువాత అటవీశాఖ భూముల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే మూడు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక జనసేన–టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. అటవీశాఖ భూముల్లో రేయింబవళ్లు అక్రమ తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను తరలించి రూ.కోట్లు వెనుకేసుకుంటున్నారు. ఇక్కడ ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా లేకపోవడం గమనార్హం. అసలు ఈ భూముల్లో ఏం జరుగుతుందో కూడా వారికి తెలియని పరిస్థితి.

రెచ్చిపోతున్న మట్టి దొంగలు

ఈ ప్రాంతంలో గతంలో అడపాదడపా గ్రావెల్ తవ్వకాలు జరిగేవి. అయితే టీడీపీ–జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక టీడీపీ–జనసేన నాయకులు జూలు విదిల్చారు. అటవీశాఖ, ఏపీఐఐసీ అధికారుల ఉదాసీనతను ఆసరా చేసుకుని మూడు నెలలుగా అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా అటవీశాఖ, ఏపీఐఐసీ, ప్రభుత్వ భూముల్లోకి చొరబడి ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వుకుంటున్నారు. దాన్ని టిప్పర్లతో మరో ప్రాంతానికి తరలించి అక్కడ ప్రవేటు స్థలంలో నిల్వ చేసుకుని సమయం చూసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో దాదాపు రూ.ఐదారు కోట్లకు పైగా గ్రావెల్ అమ్మకాలు జరిగినట్లు స్థానికులే చెబుతున్నారు.

అప్పట్లో పోరాటం... ఇప్పుడు భాగస్వామ్యం

వాస్తవానికి కొన్నేళ్లుగా అక్రమ తవ్వకాల్లో స్థానిక టీడీపీ నాయకలదే హవా. అయితే ఐదేళ్లలో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడినా అడపాదడపా టీడీపీ నాయకులు తమ కక్కుర్తి బుద్ధి చూపేవారు. దీనిపై స్థానిక జనసేన నాయకులు ఇక్కడ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని ప్రత్యక్ష పోరాటాలు చేసేవారు. స్థానిక జనసేన నేతలతో పాటు జనసేన రాష్ట్రస్థాయి నేతలు కూడా ఈ ప్రాంతానికి వచ్చి గ్రావెల్ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేసేవారు. అయితే ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిందో సీన్ మారిపోయింది. అక్రమ తవ్వకాలు జరుపుతున్న టీడీపీ నాయకులతో జనసేన నాయకులు కుమ్మక్కయ్యారు. అధికారంలో ఉన్న ఇరు పార్టీల నాయకులు కలిసి 'నీకింత.. నాకింత' అన్న చందంగా నరవ అటవీ ప్రాంతంలోకి చొరబడి గ్రావెల్‌ను దోచుకుని రూ.కోట్లు అర్జించి పంపకాలు జరుపుకుంటున్నారన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి నరవలోని ప్రకృతి వనరుల దోపిడికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

కళ్లు మూసుకున్న ఏపీఐఐసీ

నరవ సర్వే నంబర్ 1తో పాటు సర్వే నంబర్ 7(70 ఎకరాల ఏపీఐఐసీ భూమి), 29, 27/8లలోని ప్రభుత్వ, గయాలు భూముల్లో కూడా టీడీపీ–జనసేన నాయకులు అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఆయా భూముల్లో అయితే పట్ట పగలే మట్టిని తరలిస్తున్నారు. అయితే దీనిపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు మాత్రమే ఇటీవల కాలంలో ఒకటి రెండు కేసులు పెట్టారు తప్ప ఏపీఐఐసీ అధికారులు ఈ అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఒక్క ఫిర్యాదు చేసినా పాపాన పోలేదు.

పొంచి ఉన్న ప్రమాదం

నరవ ప్రాంతంలో ఇష్టానుసారం తవ్వకాలు జరపడంతో పాటు గ్రావెల్ రవాణా కోసం సమీపంలోని గోదావరి పైపులైన్ మీదుగా మార్గం ఎంచుకున్నారు. ఈ పైప్‌లైన్ మీదుగా రోజూ కనీసం 200 వరకు టిప్పుల గ్రావెల్ రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో టిప్పర్ల ఒత్తిడికి పైప్‌లైన్ పగిలితే భారీ నష్టం ఏర్పడుతుంది. దీంతో పాటు అది మరమ్మతులయ్యే వరకు విశాఖ నగర ప్రజలు దాహార్తితో ఉండాల్సిందే. మరోవైపు జేసీబీల సహాయంతో ఇష్టానుసారం లోతు తవ్వడంతో పశువులతో పాటు మనుషులు అందులో పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

200 మీటర్ల దూరంలో తవ్వకాలు గుర్తించాం

నరవ ప్రాంతంలో అటవీ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే పరిశీలించాం. అయితే అటవీశాఖ భూములకు దాదాపు 200 మీటర్ల దూరంగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించాం. మా (అటవీశాఖ) ప్రాంతంలో ఎక్కడా తవ్వకాలు లేవు. ఫిర్యాదులు వస్తే తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– శేఖర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి, గాజువాడ డివిజన్

బొత్సకు అభినందనలు


బొత్సకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ నేతలు

డాబాగార్డెన్స్/మహారాణిపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభినందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు.

కోడ్ ఎత్తివేతకు విజ్ఞప్తి : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో కోడ్ ఎత్తివేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ లేఖ రాశారు. అక్కడ నుంచి సమాచారం వచ్చిన తర్వాత కోడ్ ఎత్తివేస్తామన్నారు.

ఎంటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆరిలోవ: మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ (ఎంటీఎఫ్) జిల్లా కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎంవీపీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి రవి సిద్ధార్థ, కార్యదర్శి పి.వి ఎస్ చంద్రరావు ఆధ్వర్యంలో కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పి.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటత్రినాథ్, కోశాధికారిగా బి.గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జిల్లాలో పలు మండలాల కార్యవర్గాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు.

నేడు ఆర్.పి. సిసోడియా పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ్ ప్రకాష్ సిసోడియా శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి మూడు గంటల వరకు తహసీల్దార్లు/సబ్ రిజిస్ట్రర్లతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో సమావేశమవుతారు. 5 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.

ముగిసిన 'ఏసీఏ' నామినేషన్ల పర్వం

- ఆరు పదవులకు ఆరుగురే దరఖాస్తు
- 8న నూతన కార్యవర్గ ప్రకటన


నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు


నామినేషన్లకు ముందు సమావేశమైన ప్యానెల్ సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల ఘట్టం ముగిసింది. ప్రస్తుత కార్యవర్గానికి చెందిన ఆరుగురు సభ్యులు రాజీనామాలతో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. వైఎస్సార్ స్టేడియంలోని ఏసీఏ కార్యాలయంలో శుక్రవారం ఆరు పదవులకు ఒకే ప్యానల్‌కు చెందిన అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 8న ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా.. ఒక పదవికి ఒకే దరఖాస్తు రావడంతో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే ఆ రోజున అధికారికంగా కార్యవర్గాన్ని ప్రకటిస్తారు. తొలుత వీడీసీఏ కార్యాలయంలో ప్యానల్ తరఫున పాల్గొనే అభ్యర్థులు సమావేశయ్యారు. 11 గంటలకు ఎన్నికల అధికారికి నామినేషన్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శిగా సేవలందించిన ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. విశాఖ నుంచి వీడీసీఏ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ సమర్పించారు. అధ్యక్షుడిగా కేశినేని నాని తరఫున ఆయన ప్రతినిధి, కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే ఎన్నిక ప్రక్రియలో పాల్గొనే 34 మంది క్లబ్ ప్రతినిధుల జాబితాను ఎన్నికల అధికారికి సమర్పించగా.. ఆక్షేపణలను ఆహ్వానించిన అనంతరం నామినేషన్లను స్వీకరించారు. నూతన కార్యవర్గం 2025 వరకు ఏసీఏ కార్యక్రమాలను పర్యవేక్షించనుంది. ఎన్నిక ప్రక్రియ పూర్తయిన అనంతరం వార్షిక సమావేశం జరగనుంది.

సంబల్‌పూర్-ఈరోడ్ స్పెషల్ రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్–ఈరోడ్–సంబల్‌పూర్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను మరికొంత కాలం పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సంబల్‌పూర్–ఈరోడ్(08311) స్పెషల్ సంబల్‌పూర్‌లో బుధవారం ఉదయం 11.35 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.32 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(గురువారం) రాత్రి 9.50 గంటలకు ఈరోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను నవంబరు 27వ తేదీ వరకు పొడిగించారు. ఈరోడ్–సంబల్‌పూర్ (08312) వీక్లీ స్పెషల్ ఈరోడ్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(శనివారం) మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను నవంబరు 29 వరకు పొడిగించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.